# ఒకానొక రాత్రి

వాన కురుస్తోంది. అలా ఇలా కాదు, కుండపోతలా కురుస్తోంది. భూమినీ, ఆకాశాన్నీ కలిపేస్తూ కురుస్తోంది. ఉరకలువేస్తూ కురుస్తోంది. రంకెలు వేస్తూ కురుస్తోంది.

ఉరుములు... పిడుగులు... మెరుపులు... ప్రబల ప్రభంజనం... పెనువర్షం... పెనుతుఫాను... చీకటి... అంతా చీకటి చీకటిగా భయానకంగా బీభత్సంగా ప్రళయంలా ఉంది.

ఎత్తయిన కొండలు... లోతైన లోయలు... మహావృక్షాలు... దట్టమైన పొదలు... ఉరకలు వేసే నదీప్రవాహం... అంతా ఒకటిగా చీకటి చీకటిలా ప్రళయాంధకారంగా, విధ్వంసంగా కనిపిస్తోంది.

మా ఇళ్ళు కొండపాదాల్ని పట్టుకొని చెదిరిపోయిన పక్షిగూళ్ళలా చితికిపోయిన జీవితాల్లా భయం భయంగా భయానకంగా కనిపిస్తున్నాయి.

నేను ఇంట్లో ఒంటరిగా ఉన్నాను. విద్యుత్తు ఎక్కడా లేదు. చీకటిలో కలిసిపోయి చీకటిలా వున్నాను. పెద్ద టార్చ్‌లైట్ చేతిలో పట్టుకొని కూర్చున్నాను. ఎక్కువగా వాడితే అదికూడా అయిపోయి ఆరిపోతుందని అప్పుడప్పుడు మాత్రమే వేస్తున్నాను.

ప్రళయంలాంటి చీకటిలో మిణుగురుపురుగు వెలుతురు చంద్రుడిలా కనిపిస్తోంది! నా చేతిలోని లైట్ నాకు నా పిడికిట్లో చంద్రుడిలా కనిపిస్తోంది! అనిపిస్తోంది! అది జీవశక్తి! అది జీవన పోరాటం! మానవాళిని నడిపిస్తున్న జీవశక్తి అది! సర్వ జీవ జాలాన్ని నడిపిస్తున్న జీవశక్తి అది! అది మరణిస్తే అంతా మరణమే అవుతుంది! అది సూర్యుడిలాంటిది!

భయపడుతూనే నిర్భయంగా ప్రళయంలాంటి ప్రకృతి వైపరీత్యంలోకి చూస్తూ, ప్రకృతి విధ్వంసంలోకి చూస్తూ కూర్చున్నాను.

ఆశ్చర్యం! ఆందోళన! అలజడి! భయం! ఎవరో తలుపు గుద్దుతున్నారు. గుండెల మీద గుద్దుతున్నట్లు భయమేస్తోంది. భయంభయంగా ఉంది. తలుపు తీయాలా? వద్దా? ఆ ఆలోచనే లేదు! రెండు గుద్దులు గుద్దితే విరిగి ముక్కలైపోయే

తలుపులు ఎంత రక్షణ ఇవ్వగలవు?! ప్రళయంలాంటి బీభత్సంలోంచి వచ్చిన వ్యక్తిని తలుపుతీసి లోపలికి రమ్మని పిలవకుండా ఎలా ఉండగలం?!

రెండు ప్రశ్నలకూ ఒకే జవాబుగా తలుపుతీశాను. మెరుపుల వెలుగులో అతడి మొహంలోకి చూశాను. ఎవరో తెలియదు. లోపలికి రమ్మని పిలిచాను. వచ్చాడు. బాగా అలసిపోయాడు. మౌనంగా కుర్చీలో కూర్చున్నాడు. మెరుపుల వెలుతుర్లో అతణ్ని చూస్తున్నాను. టార్చ్‌లైట్ వేసి మొహంలోకి పరిశీలనగా చూశాను. అతడు ఏమీ మాట్లాడలేదు. మౌనంగా ఉండిపోయాడు. అతడు ఓ యువకుడు. ధైర్యం, స్థైర్యం వున్నవాడిలా కనిపించాడు. అంత బీభత్సంలో కూడా నిబ్బరంగా నిదానంగా నిశ్చింతగా కనిపించాడు. అతణ్ని మెరుపుల వెలుతుర్లో చూస్తూ ఆశ్చర్యపోతున్నాను.

మంచినీళ్ళు తెచ్చి ఇచ్చేను. గడగడ తాగేశాడు. "ఎంతో దాహం వేసింది. మంచినీళ్లు అయిపోయాయి. బురదనీరు ఎలా తాగడం?! మెడ వెనక్కి పెట్టి నోరువిప్పి ఆకాశంలోకి చూస్తూ కొంతసేపు నిలబడ్డాను. వానచినుకులు నోట్లో పడేలా నిలబడ్డాను. నోరు తడుపుకున్నాను. కొంత దాహం తీర్చుకున్నాను. మీరిచ్చిన నీరు తాగి పూర్తిగా దాహం తీర్చుకున్నాను. ధన్యవాదాలు..." అని చల్లని వెన్నెల్లా మాట్లాడి మౌనంలోకి వెళ్ళిపోయాడు.

ప్రకృతి క్రూరంగా విరుచుకుపడుతోంది. ఎక్కడో ఓ పిడుగు. ఎక్కడో ఓ కొండగుండె బద్దలైపోయింది... ఎక్కడో ఓ మహావృక్షం కూలిపోయింది...

"ప్రకృతి తన సృష్టిని తానే విధ్వంసం చేసుకొంటోంది! మానవ సృష్టిని కూడా విధ్వంసం చేస్తోంది!...' మెరుపుల వెలుతుర్లో అతడి మొహంలోకి చూస్తూ అన్నాను.

"మీరు చెప్పింది నిజమే! అయితే - నేనో చిన్నమాట చెప్తాను... ప్రకృతికి నియమం ఉంది! నైజం వుంది! నీతి వుంది! ప్రకృతికి అంతా ఒకటే! అందరూ ఒకటే! వివక్షలేదుకదా! మరి మానవుడు?!... వివక్షతో స్వార్థంతో విధ్వంసాన్ని సృష్టిస్తున్నాడు!... ఆ విధ్వంసం ప్రకృతి వైపరీత్యాలు సృష్టిస్తున్న విధ్వంసం కంటే ఎంతో క్రూరాతి క్రూరమైంది... ఎంతో విధ్వంసకరమైంది...."

నేను ఆశ్చర్యపోతూ అతడి మొహంలోకి చూస్తున్నాను. ఎన్నో ఏళ్లు

పరిచయమున్న వ్యక్తిలా మాట్లాడుతున్నాడు. ఎన్నో విషయాల పట్ల ఎంతో లోతైన అవగాహన వున్నవ్యక్తిలా మాట్లాడుతున్నాడు.

సున్నితంగా మృదువుగా పెదవులు కదుపుతూ అతడు నా మొహంలోకి అత్యంత గౌరవంగా, ప్రేమగా చూస్తూ మళ్ళీ నోరు విప్పేడు.

"ప్రబల ప్రభంజనంలో ఇప్పుడు మనకళ్లముందు వృక్షాలు ఫెళఫెళమని కూలిపోతున్నట్లు, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ప్రభంజనంలో ఎందరి బతుకులు ఫెళఫెళమని కూలిపోవడం లేదు?!... పిడుగులు పిడుగుల్లా విరుచుకుపడుతూ కొండల గుండెల్ని చీల్చేస్తున్నట్లు – ప్రజల బ్రతుకుల్ని, భూసంపదల్ని, భూవనరులనూ అన్యాక్రాంతం చేయిస్తూ, దురాక్రమణలు చేయిస్తూ, ప్రజల గుండెలను చీల్చి వేయడంలేదు... వరద బురద ప్రవాహం పచ్చని చేలని ఆక్రమించి విధ్వంసం చేస్తున్నట్లు ఎందుకూ పనికిరాని వస్తువ్యామోహ వరద బురద ప్రవాహం పచ్చని ప్రజా జీవితాన్ని విధ్వంసం చేయడంలేదు?!... పనికిరాని వారి సేవా రంగ చరాస్తులను మన ప్రజల నెత్తిమీద రుద్దుతూ మన స్థిరాస్తులను దోచుకోవడంలేదు?!... అప్పుల వరదలో ప్రజలను ముంచేస్తూ, పరోక్ష వలసపాలనలోకి ప్రజలను నెట్టి వేయడం లేదు?!... ఏ బీభత్సం అత్యంత క్రూరమైంది?!..." అతడుమండే సూర్యుల్లా కాకుండా, చల్లని చంద్రునిలా చెప్పి మళ్లీ మౌనంలోకి వెళ్ళిపోయాడు.

నేను రాత్రిపూట గోధుమరొట్టెల్ని తింటాను. ఆరు రొట్టెలూ, దానికి సరిపడ కూర తయారు చేసుకొని సిద్ధంగా వుంచుకున్నాను. అలసిపోయిన ఆ యువకుడికి ఐదు రొట్టెలూ కూర ఇచ్చి, నేనొక రొట్టెను తీసుకున్నాను. "మీరు ఆకలితో ఉండిపోతారా! ఒద్దు! నేనొప్పుకోను!..." అని రెండు రొట్టెలు తిరిగి ఇచ్చేశాడు. ఎంతో కృతజ్ఞత తెలియజేశాడు.

వర్షం వర్షంలా కుండపోతలా కురుస్తూనే వుంది. మేఘాలు మేఘాల్లా భీకరంగా పోరాడుతూనే ఉన్నాయి. పిడుగులు పిడుగుల్లా విరుచుకుపడుతూనే వున్నాయి. మెరుపులు మెరుపుల్లా అగ్నిజ్వాలల్లా మెరుస్తూనే వున్నాయి. ప్రభంజనం ప్రభంజనంలా ప్రబలంగా వీస్తూనే ఉంది. వరద వరదలా ప్రవహిస్తూనే వుంది.

అతడు ఖాళీసీసాలను నీళ్లతో నింపి, ధన్యవాదాలు చెప్పి, బయల్దేరాడు.

"ఇప్పుడా?!... ఇంత బీభత్సంలోనే వెళ్లాలా?!"

"అవును! వెళ్లాలి! సామ్రాజ్యవాద ప్రపంచీకరణ రాజకీయ ఆర్థిక సామాజిక దురాక్రమణ తీవ్రవాదం – తీవ్రవాదాన్ని – సృష్టిస్తోంది!... సమసమాజ ప్రజాకాంక్ష జీవశక్తిలాంటిది! జీవన పోరాటం లాంటిది! మండే సూర్యుళ్లాంటిది! మార్గాలు ఏవైనా మార్గాలు వేరైనా – ప్రజాశయం, ప్రజాలక్ష్యం – ఎప్పుడూ ఒక్కటే! ఐక్యత కంటే ఏ బీభత్సం శక్తివంతమైంది కాదు! కాజాలదు!..." అని అతడు ప్రభంజనంలా ప్రభంజనాన్ని దూసుకుంటూ వెళ్లిపోయాడు.

అతడెవరో నాకు తెలీదు!

★ ★ ★

(ఆదివారం ప్రజాశక్తి - 25.01.2004)